# 5. దైవ సింహాసనం ఛాయల్లో...

హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు : "ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారు : "ఏడు రకాల మనుషులున్నారు, వారిని అల్లాహ్ తన ఛాయలో ఉంచుకుంటాడు, ఆ రోజున ఆయన ఛాయతప్పితే మరో ఛాయ ఉండదు. (ఆ ఏడుగురు ఎవరంటే) న్యాయం చేసే నాయకుడు, ప్రభుదాస్యంలో గడిపిన నవ యువకుడు, మస్జిదుల్లో మనసు లగ్నమై ఉండే మనిషి, అల్లాహ్ కొరకు పరస్పరం ప్రేమించేవారు, ఆ ప్రాతిపదికపైనే సంఘటితమయ్యేవారు, ఇంకా ఆయన కొరకే వేర్పడిపోయేవారు, అందమయిన స్త్రీ చెడు వైపునకు పిలిస్తే నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను అని చెప్పి తిరస్కరించే వారు, కుడిచేతితో దానం చేస్తే ఎడమ చేతికి తెలియనంత గుట్టుగా దానధర్మాలు చేసే వ్యక్తి, ఒంటరిగా నున్నప్పుడు దైవాన్ని స్మరించగా తన రెండు కళ్ళ నుండి కన్నీరు కార్చే వ్యక్తి." (బుఖారి)

మహత్ పూర్వకమయిన ఈ హదీసును ఇమామ్ బుఖారి (రహ్మాలై) సహీహ్ బుఖారిలో నాలుగు చోట్ల పొందుపరిచారు. ఉల్లేఖనంలోని పదాలలో కొద్దిపాటి వైవిధ్యం గోచరిస్తోంది. ఇమామ్ ముస్లిం, తిర్మిజి, నిసాయి (రహ్మాలై)లు కూడా ఈ హదీసును తమ గ్రంథాలలో ఉటంకించారు.

ఈ హదీసులో ప్రళయదినం నాటి దృశ్యం వివరించబడింది. ఆనాడు సూర్యుడు అతి దగ్గరగా ఉంటాడు. ప్రజలంతా గ్రీష్మ తాపానికి ఉడికిపోతూ చెమటలో మునిగిపోతుంటారు. ఆ సమయంలో వారికి ఎటువంటి నీడా ఉండదు. అప్పుడు అల్లాహ్ తన దాసుల్లో కొందరిని తన ఛాయల్లోకి తీసుకుంటాడు. ఇక్కడ ఛాయ అంటే భావం దైవ సింహాసనం యొక్క నీడ. దీని వివరాలు సల్మాన్ (రజిఅన్) హదీసులో ఉన్నాయి.

ఏడు రకాల మనుషులకు ఈ సందర్భంగా శుభవార్త ఇవ్వబడింది. మరికొన్ని హదీసుల ప్రకారం ఈ ఏడు రకాల వారికే కాకుండా విశ్వాసులకు తోడ్పాటునిచ్చిన మరికొందరికి కూడా దైవ సింహాసనం నీడ పొందే భాగ్యం ప్రాప్తమవుతుందని విదితమవుతోంది. ఇమామ్ ముస్లిం ఉల్లేఖనం ప్రకారం రుణగ్రస్తుడికి గడువు ఇవ్వటమో లేదా అతన్ని పూర్తిగా మన్నించి వదలివేయడమో చేస్తే అల్లాహ్ అతనికి తన నీడలో చోటిస్తాడు. హకీమ్ ఉల్లేఖనాన్ని బట్టి యోధునికి సహాయపడిన వారు, బానిస విమోచనకు తోడ్పడిన వారు ప్రళయదినాన దేవుని నీడకు నోచుకుంటారు. బగ్వి ఉల్లేఖనం ప్రకారం సత్యవంతుడైన వ్యాపారి ప్రభువు ఛాయలో ఉంటాడు.

1. హదీసులో అందరికంటే ముందు న్యాయశీలుడైన నాయకుని ప్రస్తావన వచ్చింది.

https://teluguislam.net

దీన్నిబట్టి న్యాయశీలుడైన నేత ప్రాముఖ్యత ఎటువంటిదో బోధపడుతుంది. నాయకుడు గనక న్యాయం చేసే వాడైతే అతని వల్ల అసంఖ్యాకమైన సంస్కరణలు జరుగుతాయి. సమాజానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. ఇక్కడ నాయకుడంటే అధికారం కల బాధ్యతాయుతుడని భావం. దైవ సన్నిధిలో ప్రవక్తల తర్వాత స్థానం న్యాయశీలుడయిన నేతదే. అసలు హదీసులో "ఆదిల్" అనే పదం ఉంది. అదల్ అంటే సమత్వం సమతూకం అనే అర్థాలు కూడా వస్తాయి. ఆదిల్ అంటే ప్రతి వస్తువు అది ఉండవలసిన చోట ఉండేటట్టు చూసేవాడు అని ఒక అర్థం. మరికొంత మంది దృష్టిలో ఆదిల్ అంటే విశ్వాసాలు, నైతిక నియమాలు, ఆచరణలో సమతౌల్యం దెబ్బతినకుండా చూసేవాడు, విచ్ఛిన్నతను, చిందర వందరతనాన్ని నిరోధించేవాడు. కర్షకుల హక్కుల్ని పర్యవేక్షించేవాడే ఆదిల్ అని మరికొంత మంది అన్నారు. ఆదిల్ అనే పదానికి అన్నిటికన్నా సమగ్రమయిన అర్థం దైవాదేశాలను ఖచ్చితంగా అమలుపరిచేవాడని.

2. "దైవదాస్యంలో యౌవ్వనాన్ని గడిపిన వాడు ......"

యౌవ్వనంలో చేసిన ఆరాధనలకు ప్రతిఫలం చాలా ఎక్కువగా లభిస్తుంది. సాధారణంగా మనిషి యౌవ్వనంలో విషయ లాలన వైపునకు మొగ్గు చూపుతాడు. ఆ వయస్సులో అతనిలో లైంగిక వాంఛలు అధికంగా ఉంటాయి. ప్రాపంచిక సుఖాల్ని జుర్రుకోవాలన్న కాంక్షలో పడి పెడత్రోవపట్టే అవకాశాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. అయినప్పటికీ అతను వాటన్నిటినీ విడనాడి సన్మార్గాన్ని అవలంబించాడంటే అతని స్థానం నిశ్చయంగా ఉన్నతమయినదే మరి.

3. "మస్జిదులలో మనసు లగ్నమై ఉండే మనిషి ....." అంటే మస్జిదులతో ఎక్కువగా ముడిపడి ఉండేవాడు. వీలయినంత ఎక్కువ సమయం మస్జిదులలో గడపటానికి అతను ఇష్టపడతాడు. వేళకు సామూహికంగా నమాజ్ చేయాలన్న ఆరాటం అతనిలో అధికంగా ఉంటుంది. మస్జిద్‌కు సంబంధించిన పనులలో, మునుముందుంటాడు. ఒకసారి నమాజ్ చేసిన తరువాత రెండో పూట నమాజ్ కూడా జమాఅత్‌తో కలసి మస్జిదులోనే చేయాలని మనసారా కోరుకుంటాడు. దీనిద్వారా విదితమయ్యే మరో విషయమేమిటంటే, ముస్లిం ఏ మస్జిద్ పట్లయినా అసూయా ద్వేషాలు కలిగి ఉండడు. ఏ మస్జిద్ అయినా అతనికి సమానమే. అతనికి కావలసిందల్లా ఏ మస్జిదులోనయినా సామూహికంగా ఫర్జ్ నమాజ్ సలపటమే.

4. "అల్లాహ్ కొరకు ఒండొకరిని ప్రేమించేవారు."

అంటే వారి పరస్పర ప్రేమ లేదా సంబంధానికి మూలం ప్రాపంచిక లాభం పొందడం కాదు. వారు మంచిని పెంపొందించడానికి, చెడులకు దూరంగా ఉండటానికి వారు

https://teluguislam.net

స్నేహం చేస్తారు. ఒకరినొకరు కష్టాలలో ఆదుకుంటారు. ఎదుటివారి దుఃఖంలో పాలుపంచుకుంటారు. గత్యంతరం లేని పరిస్థితి ఆసన్నమైతే, లేదా మరణం వస్తే తప్ప వారు వేరు కారు.

5. "..... నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను" అని పలికే మనిషి. అందమైన స్త్రీ మనసును వశీకరిస్తుంది. కాని సులభంగా దక్కదు. కాని ఒక సౌందర్యవతి తారసపడటమే గాక, కోరివచ్చి కవ్విస్తుంటే, పురుషుడిని మరుపురాని పొందుకోసం రమ్మంటుంటే, ఎటువంటి వ్యయ ప్రయాసలు లేకుండానే కోరిక తీర్చుకునే అవకాశం లభిస్తుంటే అట్టి పరిస్థితిలో కూడా మగవాడు "నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను" అని చెప్పి ఆమె ఆహ్వానాన్ని త్రోసిపుచ్చటం అపూర్వమైన విషయం. 'తఖ్వా' (భయభక్తులు, నిష్ఠ)కు ఇది గొప్ప తార్కాణం.

6. "కుడిచేతితో చేసిన దానం గురించి ఎడమ చేతికి తెలియదు." ఇది, మనిషి తానుచేసే నఫిల్ (అదనపు) దాన ధర్మాలకు ఉద్దేశించినదని పండితుల అభిప్రాయం. అయితే 'జకాత్' ఫర్జ్‌గా చేయబడింది. కనుక దాని చెల్లింపు బాహాటంగా లేదా సామూహికంగా జరగవలసి ఉంటుంది. కాని సర్వ సాధారణంగా ఇచ్చే దానధర్మాలు ఒక ప్రత్యేక సమయంలోనే గాక తరచూ చేస్తుండటం, అదీ గుట్టుగా ఇవ్వటం ఉత్తమం. అలాగాక బహిర్గతంగా, అందరికీ తెలిసే విధంగా దానాలుచేస్తే, దాతలో ప్రదర్శనా బుద్ధి జనించే ప్రమాదముంది. దీనిద్వారా రెండు విషయాలు దృష్టికి వస్తాయి. ఒకటేమంటే జకాత్ ఇవ్వగల స్థోమత ఉన్నవాడే దానధర్మాలు చేసే శక్తిని కూడా కలిగి ఉంటాడు. రెండవదేమంటే; మనిషి కేవలం జకాత్ చెల్లించేసి నా వంతు తీరిపోయిందని చేతులు దులుపుకు కూర్చోవటం సమంజసం కాదు. వీలయినంతవరకు, దేవుడు తనకు ప్రసాదించిన దాంట్లోంచి బీద సాదలకు సాయం చేస్తుండాలి. ఆ సాయం కూడా నిశ్శబ్దంగా, గప్‌చిప్‌గా చేస్తే అతను తన మనసును ప్రదర్శనాభావం, అహంకార భావం నుండి కాపాడిన వాడవుతాడు. ఎందుకంటే ప్రదర్శనాబుద్ధి, అహంకారం మనిషి సదాచరణలను హరించివేస్తాయి. కుడిచేయి, ఎడమచేయి దృష్టాంతం విషయావగాహన కోసం ఇవ్వబడింది. దీని భావం ఏమంటే; అతనెంత రహస్యంగా దానం చేశాడంటే దగ్గరలో ఉన్నవారికి, ఇరుగుపొరుగు వారికి, బంధుమిత్రులకు కూడా దాని గురించి తెలియలేదు. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఏమని సెలవిచ్చాడో చూడండి :

**"ఒకవేళ మీరు మీ దానాలను బహిరంగంగా ఇస్తే అదీ మంచిదే. కాని మీరు గనక రహస్యంగా వాటిని అగత్యపరులకు ఇస్తే అది**

https://teluguislam.net

**మీ కొరకు ఎంతో మేలైనది. అలా చేయటం వల్ల మీ అపరాధాలెన్నో పరిహరించబడతాయి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు."**

**(అల్ బఖర : 271)**

7. "ఒంటరిగా అల్లాహ్‌ను జ్ఞాపకం చేస్తుండగా రెండు కళ్ళ నుండి నీళ్ళు కార్చే వ్యక్తి."

దైవ నామస్మరణ అనేది అయన గ్రంథాన్ని పారాయణం చేయడం వల్లనో, అయన స్తోత్రం చేయడం ద్వారానో, అయన ఆగ్రహానుగ్రహాలపై యోచన చేయడం వల్లనో, అయన నిదర్శనాలపై ఆలోచించడం ద్వారానో నెరవేరుతుంది. ఒంటరిగా ఉన్నప్పుడు అన్న షరతు ఎందుకు పెట్టబడిందంటే ఒంటరి తనంలో మనిషి ఏకాగ్రత కలిగి ఉంటాడు. ప్రదర్శనా భావానికి దూరంగా ఉంటాడు. అట్టి సమయంలో అతనికి దేవుని శిక్ష జ్ఞప్తికివస్తే మనసులో ఆందోళన హెచ్చుతుంది. హృదయం కరిగి కళ్ళగుండా ప్రవహిస్తుంది. ఒక్కోసారి ఒంటరిగా దైవ సన్నిధిని పొందానన్న అనందానుభూతితో కూడా కన్నీరు వస్తుంది. ఇటువంటి వారికి శుభవార్త ఇవ్వబడింది:

**"వారు ఎటువంటి ప్రవక్తలంటే, అల్లాహ్ వారిపై కానుకల్ని కురిపించాడు – ఆదం సంతతి నుండి ఇంకా ఆ ప్రజల వంశం నుండి, ఎవరినైతే మేము నూహ్ (అలైహి)తో పాటు ఓడలో పయనింపజేశామో. ఇంకా ఇబ్రాహీమ్ వంశం నుండి, ఇస్రాయీల్ వంశం నుండి, ఇంకా వారెవరంటే, సన్మార్గం పొందినవారు మరియు నియుక్తులైన వారు. వారి పరిస్థితి ఎటువంటిదంటే, కరుణామయుని వచనాలు వారికి వినిపించినప్పుడల్లా వారు ఏడుస్తూ సాష్టాంగపడే వారు."** **(మర్యమ్ : 58)**

ప్రారంభంలో పేర్కొనబడిన హదీసులో ఏడు రకాల సద్వర్తనుల ఉన్నత స్థానాన్ని, ప్రళయ దినం నాడు వారు పొందే మహదానుగ్రహాన్ని గురించి ప్రధానంగా చెప్పటం జరిగింది. ఏ మనిషిలోనయినా అటువంటి సుగుణాలనేకం సృజించబడటం, వాటి మూలంగా దేవుని కారుణ్యఛాయల్లో చోటు లభించటం ఆశ్చర్యకరమేమీ కాదు. కావలసిందల్లా చిత్తశుద్ధితో సాధన చేయడమే.

https://teluguislam.net